ప్రజాపక్షం

# జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 24 మార్చి , 2026 | పేజీలు : 06




ప్రజాపక్షం/దేవరకొండ: తెలంగాణ రాష్ట్రంలో రైతు భరోసా పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ముఖ్యమంత్రి కార్యాలయంలో రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డిని సహచర ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్.

# వడదెబ్బల పట్ల అప్రమత్తం

### ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పిహెచ్‌సిలలో బెడ్లను, సెలైన్లను సిద్ధంగా ఉంచాలి


### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** వేసవి కాలం సమీపిస్తున్న కొద్దీ, ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రానున్న వేసవికాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవికాలంలో వాతావరణ మార్పులతో మనుషులలో ఆరోగ్య సమస్యలు తలెత్తి శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ గురయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు అన్ని శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా గ్రామ, పట్టణ, మున్సిపాలిటిలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అన్ని దవాఖానాలలో అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, పిహెచ్‌సిలలో వడదెబ్బ బారినపడిన వారి కోసం బెడ్లను, సెలైన్ లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెండెం వెంకటరమణ, సిఈఓ జిల్లా పరిషత్ శిరీష, డిప్యూటి డిఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో గొర్రె మృతి

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల పరిధిలోని దామెర గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం మరోసారి బయటపడింది.షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక గొర్రె మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారి తీసింది.గ్రామానికి చెందిన కడారి శీను అనే రైతు తన జీవనాధారంగా గొర్రెలను పెంచుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం సాయంత్రం గొర్రెలను మేపుకుని వస్తుండగా,గ్రామ సమీపంలోని పెద్దమ్మ గుడి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ దగ్గర ప్రమాదం జరిగింది. ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఎటువంటి రక్షణ కంచె లేకపోవడంతో,ఒక గొర్రె షార్ట్ సర్క్యూట్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గొర్రె విలువ సుమారు రూ.25వేలు ఉంటుందని,అది తన జీవనాధారమని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.ఒక గొర్రె కోల్పోవడం కూడా తమకు పెద్ద నష్టమని కన్నీటి పర్యంత మయ్యాడు. అధికారులు వెంటనే స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.



## శివరామ క్షేత్రంలో లెక్కల గందరగోళం

## ఆరేళ్ల ఖాతాలు బయటపెట్టాలని డిమాండ్

### లెక్కలు తేలాకే నూతన కమిటీ ఎన్నిక అంటున్న గ్రామస్తులు



**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని ప్రాచీన శివరామ క్షేత్ర ఆలయంలో గత ఆరు సంవత్సరాలుగా ఆదాయవ్యయాల లెక్కలు వెల్లడించకపోవడం తీవ్ర వివాదానికి దారితీసింది.కాకతీయుల కాలం నాటి ఈ ప్రసిద్ధ ఆలయం మండలానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచి,ప్రతి రోజు భక్తులతో కిటకిటలాడుతోంది.రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకున్న తర్వాత పూజారిని నియమించి నిత్యపూజలు కొనసాగిస్తున్నా,ఆలయ ఆర్థిక వ్యవహారాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహిస్తూ, భక్తుల నుంచి చందాలు, కానుకలు, ప్రత్యేక పూజల పేరుతో రుసుములు సేకరిస్తున్నారు.ఈ సందర్భంగా వందలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు. ఆలయ పాలక మండలి ప్రతి కులానికి చెందిన ప్రతినిధులతో ఏర్పాటై,చైర్మన్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలను నిర్వహిస్తోంది.అయితే గత ఆరు సంవత్సరాలుగా వచ్చిన విరాళాలు,ఖర్చయిన వ్యయాలు, ఆలయానికి వచ్చిన మొత్తం ఆదాయం గురించి లెక్కలు చూపాలని గ్రామ పెద్దలు,భక్తులు సోమవారం ఆలయ ప్రాంగణంలో ప్రశ్నించారు.దీనికి పాలక మండలి సభ్యులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.ఇక ఇటీవల మునుగోడు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన పాలకూరి నరసింహ రమాదేవి ఎన్నికల సమయంలో ఆలయానికి రూ.50 లక్షలు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసిన నేపథ్యంలో ఆ నిధుల వినియోగంపై కూడా కొందరు సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు.ఆలయ అభివృద్ధి కోసం భక్తులు అందజేస్తున్న విరాళాలు సరైన విధంగా వినియోగం కావడం లేదని, కొందరు వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి లెక్కలు బయటపెట్టి పారదర్శకత తీసుకురావాలని, ఆ తర్వాతే నూతన కమిటీని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.ప్రసిద్ధి గాంచిన ఈ శివరామ క్షేత్రంలో నెలకొన్న లెక్కల వివాదం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తేవాలి

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** సాంకేతిక విప్లవం నేపథ్యంలో ఉద్భవించిన గిగ్ ఎకానమీలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. సోమవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన గిగ్ వర్కర్ల సమస్యలను ప్రస్తావించారు. ఉబార్, ఓలా, స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సేవలు అందిస్తున్న యువత నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజల అవసరాలను తీర్చడంలో గిగ్ వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, అయితే వీరికి సరైన ఉద్యోగ భద్రత లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలు జరిగినపుడు ఆదుకునే నాథుడు లేక అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఆరోగ్య బీమా, పెన్షన్, ప్రమాద బీమా వంటి కనీస సామాజిక భద్రతా సౌకర్యాలు వీరికి అందడం లేదని అయిలయ్య విమర్శించారు. గిగ్ వర్కర్లను కేవలం 'భాగస్వాములు'గానే చూడకుండా, వారిని కార్మికులుగా గుర్తించి ప్రత్యేక విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు.


## బస్వాపూర్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** బస్వాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు సాగు నీరు అందించే ఈ కీలక ప్రాజెక్టుపై స్పష్టమైన గడువు ప్రకటించాలని సంబంధిత మంత్రిని కోరారు.నకిరేకల్ నియోజకవర్గంలోని రామన్నపేట, చిట్యాల మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని తెలిపారు.ప్రాజెక్టులో భాగంగా మూసీ నదిపై నిర్మించాల్సిన బ్రిడ్జ్ పనులను వెంటనే చేపట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు ప్రయోజనం చేకూరే ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు.

## గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణంలోని చికెన్ సెంటర్లు, హోటల్స్, బేకరీలలో డొమెస్టిక్ సిలిండర్స్ అక్రమంగా వినియోగిస్తున్న వారిపై సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం దాడులు నిర్వహించి వారి నుండి 27 సిలిండర్లలో 3 నిండు, 24 ఖాళీ సిలిండర్లను పట్టుకొని గోదాంలో భద్రత నిమిత్తం అప్పగించినట్లు తెలిపారు. సివిల్ సప్లై అధికారులు అంజయ్య, వోఎస్‌డి, ఈటిసి టీం1 కమాల్‌పాషా, డిప్యూటి తహశీల్దార్ సివిల్ సప్లై ముబీన్, డిటి సివిఎస్ దీపక్, సైదులు, కుమార్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సైదులు పాల్గొన్నారు.



## పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ వరం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అన్నాదురైనగర్‌కు చెందిన మర్రి శ్రీనివాస్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ (సిఎంఆర్ఎఫ్) రూ.20వేల చెక్కును ఆయన అందజేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి సహకారంతో బాధితుడికి చెక్కును అందజేసినట్లు ఆయన వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీఉల్లా, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక క్విజ్ పోటీలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వేదాంత భజన మందిరం వారిచే 74వ శ్రీరామనవమి నవరాత్రోత్సవాల వేడుకల్లో భాగంగా సోమవారం బొడ్రాయిబజార్ సెంటర్‌లో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు రామాయణంపై ఆధ్యాత్మిక క్విజ్ పోటీలను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రాచర్ల వెంకటేశ్వరరావు, సోమ అశోక్ నిర్వహణలో విద్యార్థులను 10 గ్రూపులుగా విభజించి రామాయణంపై ప్రశ్నలు అడిగి విద్యార్థులలో ఆసక్తిని కలిగించారు. నాగవెల్లి ప్రభాకర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరకంటి నాగరాజు, గుండా రమేష్, అర్చకులు సింగరాచార్యులు, కమిటి సభ్యులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## కనీస వేతనం అమలు చేయాలి



**ప్రజాపక్షం/నూతనకల్ :** ఆశా కార్యకర్తలకు రూ.18వేల కనీస వేతనం అమలు చేయాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ చరణ్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్త్ ఇన్సూరెన్స్ అమలు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తూ కాంటాక్ట్ పద్ధతిలో ఆశలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశాలు ఎల్ సుజాత, జ్యోతి, సరోజ, వినోద, రేణుక, సరిత, నాగమణి, సుజాత, రజిత, సరోజ, శైలజ ఉన్నారు.

## మేళ్లచెర్వు నాయబ్ తహాశీల్దార్ సస్పెండ్

**ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్లచెర్వు) :** కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా అక్రమంగా ఫౌతి (సక్సెషన్) చేసిన మేళ్లచెర్వు నాయబ్ తహశీల్దార్ శ్రీధర్ నాయక్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టానికి లోబడి అధికారులు పనిచేయాలని సూచించారు.

## బడ్జెట్‌లో బిసి వర్గాలకు తీరని అన్యాయం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026/27 బడ్జెట్‌లో బిసి వర్గాలకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్‌పి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి వట్టె జానయ్య యాదవ్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలో టిఆర్‌పి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ బిసిలు రాష్ట్రంలో పెద్ద శాతం ఉన్నప్పటికి బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. బిసిల ఓట్ల కోసం కామారెడ్డి డిక్లరేషన్ ఇచ్చి మొండి చెయ్యి చూపించారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బిసిలను మోసం చేస్తోందని ఆరోపించారు. బిసి వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బిసిల హక్కుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీలో నాయకులు మామిడి అంజయ్య, మీర్ అక్బర్, కొన్నె మంజుల గౌడ్, నారాయణదాసు కవిత, కుంభం నాగరాజు, సోమగాని లింగస్వామి, బొల్లె సైదులు, ఆవుల అంజయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామోత్సవం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శ్రీరామోత్సవం కార్యక్రమం సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీరామనగర్ శ్రీవిజయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సామాజిక వేత్త గుండా రమేష్ మాట్లాడుతూ శ్రీరాముడు ప్రజలందరిని కుల, మత రహితంగా ప్రేమించి, వారి అభిష్టానుసారం శ్రీరామ రాజ్యపాలన అందించారని అన్నారు. పితృవాక్య పరిపాలన, సోదరులపై ప్రేమ, ఏకపత్నివ్రతుడిగా ఆద్యంతం మాట తప్పని ఆదర్శ జీవితం గడిపారని ప్రతి ఒక్కరూ శ్రీరాముడు చూపిన మార్గంలో నడిచి జీవితం సుసంపన్నం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్ష కార్యదర్శులు ఎం కొండల్‌రెడ్డి, నాగవెల్లి దశరథ, గుండా శ్రీనివాసులు, నాగవెల్లి ప్రభాకర్, మరిగంటి వరదాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులకు శ్రీరామలేఖనం, కీర్తనలు నిర్వహించి, భక్తిగీతాలు ఆలపించారు.

## చెట్లముకుందాపురంలో సంపూర్ణ మద్యపాన నిషేధం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** గ్రామాల్లో మద్యపానం వల్ల కలిగే అనర్థాలను అరికట్టి, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామస్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సోమవారం గ్రామ సర్పంచ్ పొనుగోటి నరేందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా ఏకమై గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని విధిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మద్యం మహమ్మారి వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, ముఖ్యంగా యువత ఆరోగ్యం పాడవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిని కాంక్షించి, అందరి సహకారంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. తీర్మానం అనంతరం సర్పంచ్, గ్రామ పెద్దలు గ్రామంలోని వీధివీధి తిరుగుతూ మద్యపాన నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం విక్రయించినా, సేవించినా భారీ జరిమానాలు విధిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసు చర్యలు కూడా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండమీది భవాని, వార్డు మెంబర్లు అనంతుల రామకృష్ణ, గడ్డం నవ్య, వాన సంధ్య, సూరపల్లి సైదులు, ఎర్రమళ్ల సన్నీ, గడ్డం శంకర్, వాన కృష్ణయ్య పాల్గొన్నారు.

## ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ నిధుల మళ్లింపుపై సర్పంచుల ధర్నా



**ప్రజాపక్షం/ఆత్మకూరు(యం) :** 2025/26 ఆర్థిక సంవత్సరంలో ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్(ఉపాధి హామీ పథకం)కింద గ్రామాలలో లేబర్ కంపోనెంట్ ద్వారా రూ.50 లక్షల పనులు కూలీల చేత పూర్తి చేయించినప్పటికీ, సంబంధిత మెటీరియల్ కంపోనెంట్ నిధులు మంజూరు కాకపోవడంతో బిఆర్ఎస్, బిజెపి సర్పంచ్‌లు నాయకులు ఎంపిడీవో కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పనులకు అనుగుణంగా 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ కింద సుమారు ఒకొక్క గ్రామానికి రూ.20 నుండి 30 లక్షల నిధులు విడుదల కావాల్సి ఉంది. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ తమ ప్రభావంతో జిల్లా అధికారులపై ఒత్తిడి తెచ్చి బిఆర్ఎస్, బిజెపి సర్పంచ్‌లు ఉన్న గ్రామానికి రావాల్సిన నిధులను కాంగ్రెస్ సర్పంచ్ ఉన్న గ్రామాలకు మళ్లించడం జరిగిందన్నారు. దీంతో గ్రామ అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని, ముఖ్యంగా సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ వంటి కీలక పనులు ఆగిపోయాయని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మా గ్రామాలకు కేటాయించాల్సిన 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్,సంకరి మంజుల పరుశరాం, గడ్డం ముత్తమ్మ, ఎరుకల యతీశ్వర్ గౌడ్, కొంగరి యాదగిరి, ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య, బొబ్బల ఇంద్రారెడ్డి, యాస ఇంద్రారెడ్డి, భాషబోయిన ఉప్పలయ్య, కాంబోజు భానుప్రకాష్, కోరె బిక్షపతి పంజాల వెంకటేష్ పాల్గొన్నారు.



## పోలీసు కుటుంబానికి చెక్కు అందజేత

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా ఆర్మ్డ్ పోలీసు విభాగం నందు పని చేస్తున్న కానిస్టేబుల్ జునైద్ ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించడం జరిగినది. దివంగత పోలీసు సిబ్బంది కుటుంబాల అవసరాలు తీర్చడంలో భాగంగా పోలీసు చేయూత పథకం ద్వారా జునైద్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల పోలీసు చేయూత పథకం చెక్కును జిల్లా ఎస్‌పి కె నరసింహ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. జునైద్ కుటుంబాన్ని పోలీసు శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీసు సిబ్బంది ప్రతినెల జీతం నుండి విరాళం అందిస్తున్నారని అభినందించారు. పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్ గౌడ్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ చరిత్ర యువతకు ఆదర్శం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** భగత్‌సింగ్ చరిత్ర నేటి యువతకు ఆదర్శం కావాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 95వ వర్ధంతి వేడుకలను సోమవారం గ్రంథాలయంలో నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో తుది శ్వాస వరకు పోరాడిన భగత్‌సింగ్ చరిత్ర నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అమరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. అవినీతి అంతమే లక్ష్యంగా యువత ముందుకు సాగాలన్నారు. ఇస్లావత్ హరినాయక్, సుధాకర్, రాము, రమేష్, కవిత, రమాదేవి, కళ్యాణి, శంకర్ పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యత



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యతను ఇస్తూ కీలక నిర్ణయాలు తీసుకోవడం అభివృద్ధికి సూచిక అని ఎన్ఎస్‌యుఐ దేవరకొండ నియోజకవర్గ నాయకులు రమావత్ సేవానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్ఎస్‌యుఐ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టడం, డిప్లమా, ఐటిఐ విద్యార్థులకు ప్రతి నెల రూ. 2వేల స్కాలర్‌షిప్ ఇవ్వడం వంటి నిర్ణయాలు విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి రూ. 1000కోట్లు కేటాయించడం చాలా ఆనందనీయం అని అన్నారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు గుండాల రాజేష్‌యాదవ్, బాణావత్ అఖిల్, కుంచాల నాగేంద్ర, ఆంబోతు అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభం

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** గ్రామాల పాలనపై వార్డు సభ్యులు అవగాహన పెంచుకోవాలని ఎంపిడీవో శ్యామల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మూడవ విడత వార్డు మెంబర్ల రక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డ్ మెంబర్లు అందరూ 100 శాతం హాజరై శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.



## ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల నరసింహ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టడానికి సిద్ధమవుతున్న బిజెపి నాయకులను, కార్యకర్తలను పోలీసులు ఉదయమే వారి ఇంటికి వెళ్లి ముందస్తు అరెస్టులు చేసి స్టేష్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలను అనేకం ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్గూరి రామ్మూర్తి, పరిపూర్ణ చారి, ధనుంజయ గౌడ్, దోసకాయల ఫణి నాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థుల విహారయాత్ర



**ప్రజాపక్షం/నూతనకల్ :** పాఠశాల విద్యార్థుల విహార యాత్రలు ఆనంద దాయకం, విద్యావంతం, శాస్త్రీయమని అలుగునూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పు నాగయ్య అన్నారు. సోమవారం మండలంలోని అలుగునూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గ్రామ సర్పంచ్ కాసా నరేందర్ సహకారంతో విద్యార్థులు హైదరాబాదులోని విహార యాత్రలో భాగంగా మౌంట్ ఒపేరాను సందర్శించారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా పాశం నరే,వ రూ.10వేలు, అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్లు, పౌచులు, స్కేలు అందజేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారబోయిన నాగేశ్వరరావు, లింగాల శ్రీనివాస్ రేణుక, గ్రామస్తులు పోడేటి సతీష్ పాల్గొన్నారు.

## సామ్రాజ్యవాద అమెరికా దాడులను ఖండిద్దాం

**ప్రజాపక్షం/కోదాడ:** బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారతదేశ దాస్య శృంఖలాలు తెంచేందుకు చిరునవ్వుతో ఉరికొయ్యని ముద్దాడిన వీరపుత్రులు భగత్‌సింగ్, రాజగుర్ సుఖదేవ్‌లని ప్రజాశక్తినివేదిక కన్వీనర్ రాయపూడి వెంకటేశ్వరరావు అన్నారు. స్వాతంత్ర ఉద్యమకారులు భగత్‌సింగ్, రాజగుర్ సుఖదేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఎంఎస్ కళాశాలలో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం అమెరికా దాని తొత్తు ఇజ్రాయిల్ లు ఇరాన్‌పై దాడి చేయడాన్ని భగత్‌సింగ్ అందించిన స్ఫూర్తితో ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాపర్తి రామనర్సయ్య, ముత్తవరపు రామారావు, కోటయ్య, జెఆర్‌కె మూర్తి, బడుగుల సైదులు, జివిఎల్‌ఎన్‌రెడ్డి, ఉదయగిరి, రాఘవరెడ్డి, నర్సింహరావు, హరికిషన్‌రావు, బిక్షం, వెంకటరత్నం, మామిడి రామారావు పాల్గొన్నారు.



## పెన్షనర్ల సమస్యల సాధనకై నిరంతరం కృషి చేస్తా



**ప్రజాపక్షం/కోదాడ:** పెన్షనర్ల శ్రేయస్సు కోసం వారి హక్కుల సాధనకు తనశక్తి మేరకు నిరంతరం కృషి చేస్తానని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతరామయ్య అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్నికైన రావెళ్ల సీతరామయ్య అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కోదాడ పట్టణ ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు మాట్లాడుతూ సీతరామయ్య కేవలం నాయకుడిగానే కాకుండా పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి, సంఘానికి మధ్య సమన్వయకర్తగా, ఒక గొప్ప రూపశిల్పిగా కృషి చేస్తున్నారని, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు వేనేపల్లి శ్రీనివాసరావు, బొల్లు రాంబాబు, రఘువరప్రసాద్, తమ్మనబోయిన వీరబాబు, జానయ్య, బ్రమరాంబ, భూపాల్‌రెడ్డి, హాజీనాయక్, బాలేమియా, నీరజ, మణిరాం, శంభయ్య, తిరపమ్మ, వీరారెడ్డి పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డలో వేంచేసిన శ్రీశాల్మలి కింద ఆది వరహాలక్ష్మి నర్సింహ వారి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్వామి వారి బ్రహ్మోత్సవాల నిర్వహణకై ఆలయ ప్రాంగణంలో జరిగిన సమన్వయ కమిటి సమావేశంలో తహసిల్దార్ బండ కవితతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈనెల 29 నుండి ఏప్రిల్ 6వ తేదీ వరకు జరగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలన్నారు. అన్ని శాఖల వారిని ఉత్సవాలను విజయవంతం చేయాలని, ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పోలీస్, ఎక్సైజ్, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ, గ్రామ పంచాయతీ అధికారులను అదేశించారు. గోపాలపురం గ్రామ దేవాలయ భూముల రైతులు సకాలంలో కౌలు చెల్లించి దేవస్థానం వారికి సహకరించాలని అదేశించారు, రెవిన్యూ శాఖ తరుపున తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఆలయ చైర్మన్ యరగాని బిక్షంగౌడ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ధర్మకర్తలు యరగాని సతీష్, పార్వతబోయిన గంగయ్య, గూడెపు నాగలింగం, పిట్టల గురవయ్య, అద్దంకి సంధ్య, కష్టాల శంకర్, ముడుంబై హరిష్‌కుమారాచార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంపి లక్ష్మణ్‌రావు, దేవాలయ కార్యనిర్వాహణాధికారి గుజ్జుల కొండారెడ్డి, సర్పంచ్ యరగాని రాధ నాగరాజు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు కమిటీ ఎన్నిక





**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పిఆర్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు వంటల ఆనంద్ బాబు అధ్యక్షతన ఆ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కాలం నారాయణ రెడ్డి,ప్రధాన కార్యదర్శి మేకల జానా రెడ్డి,గౌరవ అధ్యక్షులు తిరందాసు సత్తయ్య ఆధ్వర్యంలో కార్యవర్గంలో ఖాళీ అయిన పోస్టులకు కొత్త వారిని ఎన్నుకున్నారు. సంఘంప్రధాన కార్యదర్శిగా చిక్కుళ్ళ సుధాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా వట్టే సైదులు ఎన్నికయ్యారు.ఈ సమావేశంలో ఆ సంఘం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి,కేతేపల్లి అధ్యక్షులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి,కట్టంగూరు ప్రధా న కార్యదర్శి చింతకాయల పుల్లయ్య,రాష్ట్ర బాధ్యులు కప్పల యాదయ్య,ముసుకు కవిత, లయిసెట్టి సత్యనారాయణ,మారపాక నరసయ్య,సారంగి నాగయ్య,సంగెం వెంకట మోహన్,నాయిని మధు, మందడి చంద్రారెడ్డి,నాతి సైదులు,నిమ్మచెట్టి బిక్షమయ్య,పూర్వ సంఘ బాధ్యులు కడారి అనిత, బొబ్బిలి శేఖర్ రెడ్డి,సంఘ సభ్యులు పొడిచేటి శంకర్, కోనేటి వెంకటయ్య,సురకంటి సునీత,పోతుల నవత, పూసోజు కవిత,తంగెళ్ల శ్రీను పాల్గొన్నారు.

## బెల్లి జనార్ధన్‌కు కడసారి వీడ్కోలు





**ప్రజాపక్షం/నకిరేకల్/కట్టంగూర్** :నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ బెల్లి జనార్ధన్ యాదవ్‌కు సోమవారం మధ్యాహ్నం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.కట్టంగూర్‌లో స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు గాయపడి ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా బంధుమిత్రులు,గ్రామస్తులు భారీగా తరలివచ్చి నివాళులు అర్పించారు. ఆయన మరణంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈఅంతిమయాత్రలో రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు డాక్టర్ వరే వెంకటేశ్వర్లు,నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్,కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్,ప్రజాగాయని వేముల పుష్ప,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొన్నారు.

బెల్లి జనార్ధన్‌కు విద్యార్థులు నివాళిలు

సమాజ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు మాజీ సైనికుడు బెల్లి జనార్ధన్ అని గ్రామ సర్పంచ్ మాచర్ల చంద్రకళ యాదగిరి కొనియాడారు.ప్రమాదవశాత్తు మరణించిన ఆయనకు చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కనుకుంట్ల నవీన్ రెడ్డి,ఉపాధ్యాయులు భూపతి అనిత,వెల్మకంటి శ్రీహరి,ఎస్ అమరలింగా చారి,సిహెచ్ వరలక్ష్మి,గ్రామ పెద్దలు మాచర్ల యాదగిరి, వంగూరి సుధాకర్, ఆకారపు జానీ, విద్యార్థులు పాల్గొన్నారు.




## నిబంధనల ప్రకారమే సంత వేలం పాట

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కొండమల్లేపల్లి పశువుల సంత వేలం పాటను నిర్వహిస్తున్నట్లు కొండమల్లేపల్లి పంచాయతీ కార్యదర్శి పానుగోతు డాకునాయక్ సోమవారం గ్రామ పంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో తెలిపారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య సంత వేలం పాట గురించి రసాభాస చర్చ జరిగింది. వార్డు సభ్యులు సంతకు సంబంధించిన డీడీని రూ. 10లక్షల నుండి రూ. 5లక్షలకు తగ్గించి, వేలం పాట గడువును మరోవారం రోజులు పొడగించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం, నిబంధనల ప్రకారమే సంత వేలం పాటను బుధవారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు డిప్యూటి డిఎంహెచ్‌వో డా. రాహుల్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నల్లగొండలోని వివిధ విభాగాలలో నిపుణులయిన జిజిహెచ్ డాక్టర్ల చేత హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అందులో 40 మందిని నల్గొండ జిల్లా కేంద్రంలోని జిజిహెచ్‌కు రిఫర్ చేశామని మెడికల్ ఆఫీసర్ డా. ఉషారాణి తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, సిహెచ్‌వో సుగుణబాయి, రాణి, సూపర్‌వైజర్ అనసూయ, నర్సింగ్ ఆఫీసర్ లక్ష్మ య్య, ఫార్మసి ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులపై బడ్జెట్ ద్రోహం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ గిరిజనుల పట్ల తీవ్ర అన్యాయం జరిగేలా ఉందని హుజూర్‌నగర్ మార్కెట్ కమిటి డైరెక్టర్, ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులు గుగులోతు నీలా హేమ్లానాయక్ ప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధిని పక్కనపెట్టి వారిని కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తోందని, గిరిజన సబ్ ప్లాన్ నిధులను సరైన విధంగా వినియోగించకుండా ఇతర అవసరాలకు మళ్లించే ప్రయత్నం జరుగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌళిక వసతులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు ఇంకా వెనుకబడి ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి, బడ్జెట్‌లో సరైన కేటాయింపులు చేయకపోవడం బాధకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

## ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన మంచాల శ్రీను కుమారుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనది బీద కుటుంబం కావడంతో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి బాధితుడికి రూ.10 వేలు హార్ధిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, బోనంకూర మల్లేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్‌గా దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూరు (యం)**: స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలకమండలి ఎన్నిక సోమవారం దేవాలయంలో మాజీ చైర్మన్ గుండేగాని అయిలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పైళ్ల దామోదర్ రెడ్డిని దేవాలయ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలకమండలి సభ్యులుగా తవిటి వెంకటేశ్వర్లు, సూరారం రాము, గడ్డం హరీష్, ఎలిమినేటి ఎలేందర్, మజ్జిగ రాంబాబు, గంగారపు రాజు, ఎలగందుల శ్రీను, బండారి సాయి, ఇంజమూరి నర్సింహా, ఎలిమినేటి దామోదర్ రెడ్డి, రాచమల్ల సత్తయ్య, కందడి వెంకట్ రెడ్డిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు సన్మానం



**ప్రజాపక్షం/రామన్నపేట** : హైదరాబాద్ ఎంఎల్‌ఏ క్వార్టర్స్‌లో నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వేరేశంను రామన్నపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట పిఏసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షంరెడ్డి, జినుకల ప్రభాకర్, జెల్ల వెంకటేష్, పూస బాకిషన్, గుత్త నర్సిరెడ్డి, శంభాల వెంకన్న, ఎర్ర శేఖర్, నీలా మహేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవి చంద్ర పాల్గొన్నారు.

## నిషేధిత జాబితానుండి ఇండ్ల స్థలాలను తొలగించాలి



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : వ్యవసాయ భూములను ఇండ్ల స్థలాలను నిషేధిత (పిఓబీ) జాబితా నుండి తొలగించాలని తుర్కపల్లి ఎమ్మార్వోను రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి కలిశారు. ఈ కార్యక్రమంలో సాగర్ల పరమేష్ యాదవ్, మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులు, గిద్దె కరుణాకర్, గడ్డమీది యాదగిరి, దాసరి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో ముందుండాలి

**ప్రజాపక్షం/చివ్వెంల** : అమ్మాయిలు అన్ని రంగాల్లో ముందుండాలని జయరాంగుడి తండ సర్పంచ్ బానోతు వెంకన్న అన్నారు. సోమవారం మండలంలోని జయరాంగుడి తండ గ్రామానికి చెందిన గుగులోతు కావ్య ఇటీవల గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో జూనియర్ అసోసియేట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించడం పట్ల సర్పంచ్ ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవుల నాయక్, సూక్య నాయక్, సైదనాయక్, శ్రీకాంత్ నాయక్, బుజ్జి పాల్గొన్నారు.



## బండెపాలెం గుట్టపైకి పల్లకిలో సీతారాముల ఉత్సవమూర్తులు



**ప్రజాపక్షం/నకిరేకల్** : శ్రీరామనవమి సందర్భంగా కేతేపల్లి మండలంలోని బండెపాలెం గుట్టపై నిర్వహించే బ్రహ్మోత్సవాలకు నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామం సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి ఉత్సవమూర్తులను సోమవారం ఘనంగా తరలించారు.బెస్తబోయుళ్లు మేళతాళాలు,డప్పు వాయిద్యాల మధ్య పల్లకిలో స్వామివారిని గ్రామ పురవీధుల గుండా బండెపాలెం గుట్టపైకి తీసుకెళ్లారు. మార్గమధ్యంలో మహిళలు నీళ్లు ఆరబోసి మంగళహారతులు పట్టి స్వామివారిని భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలకు సాగనంపారు. ప్రతి ఏడాది బండెపాలెం గుట్టపై వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు చందుపట్ల ఆలయం నుంచి ఉత్సవమూర్తులను తీసుకెళ్లి, బ్రహ్మోత్సవాల అనంతరం తిరిగి చందుపట్ల ఆలయానికి తీసుకురావడం ఆనవాయితీగా కొనసాగుతోందని చందుపట్ల, బండెపాలెం సీతారామచంద్ర స్వామి ఆలయాల చైర్మన్లు మేడవరపు కిషన్‌రావు, మారం మీనారెడ్డి తెలిపారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి,ఉపసర్పంచ్ ఓర్సు మంజుల శ్రీను,రంగారెడ్డి,నర్సింగ్ సోమేశ్వర్,మాజీ సర్పంచులు కొమ్మ వెంకటేశం,నర్సింగ్ వెంకటేశం, వార్డు సభ్యులు నాగయ్య,జానయ్య,కొప్పు సత్తయ్య, బిక్షం రెడ్డి,బండెపాలెం మాజీ సర్పంచ్ వడ్డెబోయిన వెంకటేశ్వర్లు,మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు వడ్డెబోయిన యాదగిరి,కార్యదర్శి మంగినిపెల్లి వెంకటయ్య,ఉపాధ్యక్షుడు గంగుల వీరయ్య,జానకీరాములు,కందరబోయిన శ్రీను పాల్గొన్నారు

## శ్రీ రామాయణ పారాయణ క్రతు మహాయజ్ఞం



**ప్రజాపక్షం/యాదాద్రి** : భూలోక వైకుంఠంగా కీర్తించబడుతున్న స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వసంత నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహింపబడుతున్న శ్రీ రామాయణ పారాయణ క్రతు మహాయజ్ఞం నాలుగవ రోజు భక్తి, వైభవాల సమ్మేళనంగా ఘనంగా కొనసాగింది. ప్రాతఃకాలంలో యాగశాలలో వేదపండితుల వేదమంత్ర ఘోషల మధ్య శ్రీమద్రామాయణ పారాయణం అత్యంత శ్రద్ధాభక్తులతో నిర్వహించారు. అనంతరం జగతే మం, సర్వలోక మంగళం, భక్తుల సకల మనోరథాల సాధనార్థం విశేష హోమ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య మహోత్సవాలలో పాల్గొనడానికి అనేక ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి, యజ్ఞశాలలో జరుగుతున్న పవిత్ర కర్మలను దర్శిస్తూ తమ భక్తిని సమర్పించుకున్నారు. వేద ఘోషలు, హోమాగ్ని జ్వాలల మధ్య క్షేత్రం ఆధ్యాత్మిక కాంతితో పరవశమై, భక్తుల హృదయాలలో దైవానుభూతిని నింపింది. శ్రీవారి కృపాకటాక్షాలు సమస్త భక్తజనులపై ప్రసరించి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సద్భాగ్యాలు కలగాలని దేవస్థానం ప్రార్థిస్తోంది.

## ఒలింపియాడ్ పరీక్షల్లో మానస విద్యా మందిర్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/మోటకొండూరు** : హైదరాబాద్‌కు చెందిన సిమ్స్ సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి (స్టేజ్II) ఒలింపియాడ్ పరీక్షల్లో మానస విద్యా మందిర్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతో ఈ ఘనత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బొప్పిడి జైపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రియాంక తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బొప్పిడి జైపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రియాంకలు మాట్లాడుతూ మహమ్మద్ అబుజార్ (ఒకటో తరగతి) సైన్స్ విభాగంలో స్టేట్ లెవల్ టాప్ ర్యాంకర్లలో నిలిచి, జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించాడని, జెట్టా అశ్వక్ (ఒకటో తరగతి) గణితం విభాగంలో స్టేట్ లెవల్ టాప్ ర్యాంకర్లలో నిలిచి, జాతీయ స్థాయిలో 1వ ర్యాంకు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చారాని వారు కొనియాడారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సిమ్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ సర్టిఫికేట్ ఆఫ్ అచీవ్మెంట్‌ను అందజేసి అభినందించారు. విద్యార్థుల అద్భుత విజయానికి సహకరించిన పాఠశాల యాజమాన్యనికి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను గ్రామ పెద్దలు, స్థానికులు అభినందించారు.

## భూముల రీసర్వే భూవివాదాలకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/నూతనకల్** : భూముల రీసర్వే ద్వారా భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహశీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని ఎడవెల్లి గ్రామంలో రీసర్వేను ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రక్రియతో భూముల సరిహద్దులు స్పష్టత పొందడంతో పాటు, పాత రికార్డుల్లో ఉన్న పొరపాట్లు సరిచేయబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డుల అధికారి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ శైలజ, ఆర్ఐ, జిపిఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఘన నివాళి

**ప్రజాపక్షం/చివ్వెంల** : అకాల మరణం పొందిన కాంగ్రెస్ మండల పార్టీ మైనార్టీ నాయకులు యండి జాఫర్‌కు సోమవారం చివ్వెంల మాజీ జడ్‌పిటిసి చింతమల్ల రాజేష్, డిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్న మధుకర్ రెడ్డిలు ఘనంగా నివాళులర్పించారు. అకాల మరణం పొందిన ఆయన కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొణతం అప్పిరెడ్డి, ఎల్క నర్సిరెడ్డి, కందుల నర్సిరెడ్డి, వెంకట్ రెడ్డి, రఫీ, సిపిఐ మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము పాల్గొన్నారు.



## బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/గుండాల**; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తుర్కలషాపురం గ్రామంలో అక్రమంగా వెలిసిన బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ లిల్లిగణేస్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిఐ, స్థానిక ఎస్ఐ తేజం రెడ్డిలకు సోమవారం వినతి పత్రం అందజేయడం జరిగింది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన గ్రామ సభలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పాలక వర్గం ఆధ్వర్యంలో గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను తొలగించాలని గ్రామ సభలో తీర్మానం చేయడం జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్ షాపులను నిర్వహించడం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలు మద్యానికి బానిసలై తమ కుటుంబాలను బలిచేస్తున్నాయని, చిన్నా, పెద్ద తేడా లేకుండా మద్యానికి బానిసలు కావడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ సరిత, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నమ్మకానికి నాంది ఫ్రెండ్లీ పోలీసింగ్

**ప్రజాపక్షం/నకిరేకల్** : ఫ్రండ్లీ పోలీసింగ్ విధానం వల్ల పోలీసులపై ప్రజల్లో విశ్వాసం పెరిగి,ఇరువర్గాల మధ్య సత్సంబంధాలు బలపడుతున్నాయని రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు తెలిపారు.సోమవారం స్థానిక వైశ్యా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, నేరాలపై ప్రజలు ధైర్యంగా పోలీసులకు సమాచారం అందించే పరిస్థితి ఏర్పడిందన్నారు.ఫ్రండ్లీ పోలీసింగ్ విజయవంతం కావాలంటే ప్రజల సహకారం కూడా అవసరమని చెప్పారు. చట్టాలపై అవగాహన పెరిగితే పరిపాలనలో పారదర్శకత పెరిగి అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు.

## వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేశారు




**ప్రజాపక్షం/రామన్నపేట** : మార్చి 31న రామన్నపేటలో జరుగు తెలంగాణ రైతు సంఘం మహిళా రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు సంఘం రాష్ట్ర సదస్సు సన్నాహక సమావేశంకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ రామన్నపేట మండల కేంద్రంలో మహిళా రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర వ్యాప్తంగా మహిళా రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా, సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల అధ్యక్షుడు గన్నెబోయిన విజయ భాస్కర్, బల్గూరి అంజయ్య పాల్గొన్నారు.

## నిరంతర సాధనతోనే ఉన్నత లక్ష్యాలు

**ప్రజాపక్షం/కోదాడ**: విద్యార్థులు పట్టుదలతో నిరంతర సాధన చేస్తే ఉన్నత స్థానాలకు ఎదిగి రాణించవచ్చని కోదాడ కెఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హదసరాణి అన్నారు. సోమవారం కళాశాలలో జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజేతలు కావడానికి నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కష్టపడి ప్రయత్నిస్తే సాధించలేనిదేది లేదని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల చందా అప్పారావు మాట్లాడుతూ అకాడమితో పాటు గొప్ప గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రల పుస్తకాలను చదవడం ద్వారా రాణించేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సైదిరెడ్డి, నాగిరెడ్డి, నిర్మలకుమారి, ఫ్రాన్సిస్, సైదులు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు

**ప్రజాపక్షం/డిండి**; ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని డిండి ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎంతటి వారైన ఉపేక్షించేదిలేదని అన్నారు. సోమవారం ఉదయం 5 గంటల సమయంలో గొనబోయినపల్లి దుందుబి వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



## తెలంగాణ పబ్లిక్ స్కూల్ చందూరులో ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/చండూరుః** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాఈ విద్యాసంవత్సరం నుండి ఆధునిక వసతులతో ప్రారంభించబోయే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను (టిపిఎస్) చండూరులో ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ చండూరు మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన చండూరులో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో మాట్లాడుతూ ఈ బడులు ఫ్రీ ప్రైమరీ నుండి 8వ తరగతి వరకు ప్రారంభమై , అనంతరం 9వ తరగతి నుండి 12తరగతుల వరకు విస్తరిస్తాయని ఈ బడులలో ఏ1 బోధన ,ఉచిత అల్పాహారం మరియు పూర్తి స్టూడెంట్ కిట్లు అందిస్తారని అన్నారు. ఈసమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు భూతరాజు శ్రీహరి, అన్నెపర్తి యాదగిరి , వరికుప్పల గిరి, పార్టీ ప్రధాన కార్యదర్శులు ఆవుల అశోక్, సోమ శంకర్ , మండల పార్టీ ఉపాధ్యక్షుడు జెట్టి యాదయ్య , దాసరి శంకర్ , నాయకులు మన్నెం ప్రవీన్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడికి సన్మానం



**ప్రజాపక్షం/డిండి;** ఎర్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని కామదేను గౌరారం గ్రామ పారిశుద్ధ్య కార్మికుడు కొండ్రపల్లి సైదులు నిత్యం గ్రామంలో ప్రజల అవసరాల కనుగుణంగా పారిశుద్యం పనులు సక్రమంగా చేస్తూ, మంచినీటి ట్యాంక్, సిసి రోడ్లను నిత్యం పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామ పరిసరాలను పారిశుద్య పనులు చేస్తూ ఉత్తమ పారిశుద్య కార్మికుడిగా సేవలందిస్తున్నందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామ వార్డు సభ్యులు, జర్నలిస్టు దర్శనం విష్ణు సోమవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లాలయ్య, సాయిలు, చెన్నకేశవులు, శంకర్, నిరంజన్, ఆంజనేయులు, వెంకట్, వెంకటరమణ, శివ, వేణు, సిద్దు, కిరణ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయవద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయవద్దని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. సోమవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్ రోడ్డులో రోడ్డును అక్రమంగా ఆక్రమించి పలువురు దుకాణాలు నిర్వహిస్తుండడంతో ప్రజల విజ్ఞప్తి మేరకు వాటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల పాదాచారులకు, వాహనదారులకు ఇబ్బందులు జరిగి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దీనిలో భాగంగానే రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారికి చెప్పి వాటిని తొలగించినట్లు వివరించారు. ట్రాఫిక్ అంతరాయం కలిగేలా వ్యాపారాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



# పామ్ ఆయిల్ సాగుపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/నాంపల్లి:** నల్లగొండ జిల్లాలోని నాంపల్లి మండలంలో రైతుల అవగాహన కోసం వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు పై ఒక ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన ఆధునిక పద్ధతులు, దిగుబడి పెంపు మార్గాలు,నీటి వినియోగం,ఎరువుల నిర్వహణ వంటి ముఖ్య అంశాలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకులు వేణుగోపాల్,ఉద్యాన శాఖ అధికారి ఆర్.విద్యాసాగర్,మండల వ్యవసాయ అధికారి బండారు శివ పాల్గొన్నారు.అలాగే వ్యవసాయ విస్తరణ అధికారులు కూడా హాజరై రైతులకు మార్గదర్శనం అందించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు రైతులకు అధిక ఆదాయం అందించే పంటగా మారుతుందని,ప్రభుత్వం అందిస్తున్న పథకాలు,సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఎన్‌జి కళాశాల అధ్యాపకుడు గుండెపోటుతో మృతి



**ప్రజాపక్షం/నల్గొండ టౌన్:** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ (ఎన్‌జి) కళాశాలలో తెలుగు విభాగంలో అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న గౌడుగు గోవర్ధన గిరి గుండెపోటుతో మృతి చెందారు.ఇటీవల గుండె పోటు రావడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు.గత ఎనిమిదేళ్లుగా కళాశాలలో సేవలు అందిస్తున్న ఆయన మరణం తీరని లోటని ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు.మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.మృతి పట్ల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కుమార్,పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి. మునిస్వామి, తెలుగు విభాగం అధ్యక్షులు డాక్టర్ వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు డాక్టర్ బట్టు కిరీటం,కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు.

బీఆర్ఏఓయూలో శ్రద్ధాంజలి

తెలుగు కౌన్సెలర్‌గా సేవలు అందిస్తున్న గోవర్ధన గిరి ఆకస్మిక మరణం పట్ల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ) రీజినల్ కేంద్రంలో శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు.రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్ బొజ్జా,సిబ్బంది మహేష్,శ్రీకాంత్, విద్యార్థులు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడుతూ గోవర్ధన గిరి మరణం తీరని లోటని పేర్కొన్నారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గ్రామ అభివృద్ధికి వార్డు సభ్యులే కీలకం



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో రామకృష్ణ శర్మ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.గ్రామాల్లో త్రాగునీరు, విద్యుత్తు, రోడ్లు, మురుగునీటి పారుదల వంటి సమస్యలను గుర్తించి పంచాయతీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచ్,ఉపసర్పంచ్,వార్డు సభ్యుల బాధ్యతలపై అవగాహన కల్పించారు.శిక్షణలో నాయకత్వ లక్షణాలు, నిధుల వినియోగం, ప్రజా ఆరోగ్యం, జనమరణాల నమోదు తదితర అంశాలపై మార్గదర్శనం ఇచ్చారు.గ్రామాభివృద్ధి కోసం నిధులను సక్రమంగా వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధు,శిక్షణ అధికారి సంధ్యారాణి,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గాలికుంటు టీకాలు

**ప్రజాపక్షం/గుండాల;** రైతులు తమ యొక్క పశువులకు తప్పని సరిగా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి డా. యాకుబ్ రైతులకు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని నూనెగూడెం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి డా. యాకుబ్ ప్రారంభించి సుమారు 147 పశువులకు టీకాలు వేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ అండెం ప్రశాంత్, పరశు రాములు, విఏ రాజు, గోపాల మిత్రలు గోవింద్, కృష్ణ, నరేష్, శ్రీను, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.



## సొంతింటి కళ సాకారం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** పేదల సొంతింటి కళను ప్రభుత్వం సాకారం చేసిందని పెన్‌పహాడ్ గ్రామ సర్పంచ్ ఒగ్గు రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు ఒగ్గు జానయ్య నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేదలు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయంతో ఇంటిని నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఒగ్గు సైదులు, కాంగ్రెస్ నాయకులు షేక్ సైదులు, ఉపేందర్, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.





## కలెక్టరేట్ ఎదుట నిరసన

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో నెలకొన్న సమస్యలతోపాటు, టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. టీచర్లకు కనీస వేతనం రూ.15వేలు ఇవ్వాలని, ఐసిడిఎస్‌కు సరిపడ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్ఇపి 2020 చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మాణం చేయాలన్నారు. 2026 విద్యాపాలసీను సవరించి ప్రీప్రైమర్ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి సుందరయ్య, జె నరసింహారావు, చెరుకు యాకలక్ష్మి, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యా రంగానికి అన్యాయం



**ప్రజాపక్షం/దేవరకొండ;** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026,2027 బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని బిఆర్ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ కేవలం అంకెల గారడి మాత్రమేనని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయించింది 8.22 శాతం మాత్రమే అని ఆయన అన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో మొదటి బడ్జెట్లో 15 శాతం కేటాయింపు చేస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా ఈ బడ్జెట్‌లో కూడా విస్మరించింది అని ఆయన తెలిపారు. విద్యా రంగానికి కనీసం 10 శాతానికి కూడా కేటాయించకపోవడం దారుణం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్‌వి నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, మండల అధ్యక్షులు లక్ష్మణ్, కౌన్సిలర్ మధు, జమీర్, ప్రవీణ్, ఆంజనేయులు, విజయ్, ఆంజనేయులు, వెంకట్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర



**ప్రజాపక్షం/త్రిపురారం:** గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో కే విజయ్ కుమారి అన్నారు. సోమవారం రైతు వేదికలో గ్రామ వార్డు సభ్యులకు మొదటి విడత నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. వార్డు సభ్యులకు తమ విధులను బాధ్యతలను తెలుసుకొని అందుకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అనంతరం వార్డు సభ్యులకు శిక్షణ సామాగ్రి నీ పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో ఊర్మిళ,సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్,రాజేంద్రకుమార్, ట్రైనర్లు నరసింహ చారి నరసింహస్వామి,శివ,రాధిక తదితరుల సిబ్బంది పాల్గొన్నారు.

## వరిపంటకు నష్టపరిహారం ఇవ్వాలి

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని చిట్టెంపహాడ్ గ్రామ పరిధిలో ఆదివారం కురిసిన గాలి దుమారం, రాళ్ల వర్షం కారణంగా సుమారు 80 ఎకరాల వరి పంట దెబ్బతింది. కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలకొరిగిపోవడంతో పాటు ధాన్యం రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.ఎకరాకు రూ.25 వేల నుండి 30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు కనీసం పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి,ప్రభుత్వానికి నివేదిక పంపించి నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ యాక్ట్ అమలు చేయాలి

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను కొనసాగిస్తాం

భగత్ సింగ్ జయంతి వర్ధంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి

పలుచోట్ల ఘన నివాళులు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ స్ఫూర్తితో అసమానతలు లేని సమాజ నిర్మాణానికై ముందుకు సాగుదాం అని సిపిఐ మండలకార్యదర్శి రేఖల శ్రీనివాస్ అన్నారు. సిపిఐ మండల సమితి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అడ్డగూడూరు మండల కేంద్రంలో స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువకిశోరులు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రేఖల శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్, కంచనపల్లి ఉప సర్పంచ్ బెల్లి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చేసిన త్యాగాలను గుర్తించి వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బోనుగా సుదర్శన్ రెడ్డి, సోలిపురం నాగిరెడ్డి, చెడే నాగేష్, నక్క మల్లయ్యపాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐఏవైఎఫ్, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, గువ్వల శేఖర్, బంటు రాము, వెంకన్న, యశ్వంత్, సంతోష్, రఫి, బంటు దేవి శ్రీప్రసాద్, సంజయ్, గౌతమ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో,జనగాం గ్రామంలో సర్దార్ భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా నేతాజీ యువజన సమాఖ్య, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సమాఖ్యవ్యవస్థాపక సభ్యులు మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, రుద్ర రాములు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, రాపర్తి సత్యనారాయణ, మాధవులు, పద్మాచారి, సీపీఐ మండల కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి 23 ఏళ్ల వయసులోనే తమ ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ రాజగురు సుఖదేవుల 95వ వర్ధంతి సందర్భంగా పరాయి దేశాల మీద ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్న అమెరికా దురాక్రమణాలకు, బిజేపి మత తత్వ విదానాలకు వ్యతిరేకంగా పోరాడాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం మోటకొండూర్ మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్బంగా ఏర్పాటు చేసిన కాగడాల ప్రదర్శనలో ముఖ్య అథితిగా పాల్గోని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కార్యదర్శి బీరకాయల మధు, గోట్టిపాముల సునీల్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, కార్యవర్గ సభ్యులు ఆలేటి బాలరాజు, బీరకాయల మల్లేష్, బోళ్ళ శ్రీను పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/డిండి**; అన్యాయాన్ని ఎదరించడమే భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు ఇచ్చే ఘన నివాళి అని సిపిఐ డిండి మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్ అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో డిండి మండల కేంద్రంలోని స్ధానిక సిపిఐ ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువ కిశోరులు షాహిద్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ గోనకొల్ కార్యదర్శి కాంపల్లి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ డిండి మండల కార్యదర్శి కళ్లెం సిద్దు, ఆదిల్, ఆంజనేయులు, నాగార్జున్, వెంకటేష్, నవీన్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/చండూరు:** భగత్‌సింగ్ ,రాజ్ గురు ,సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతిని పురష్కరించుకొని ఏఐవైఎఫ్ ఏఐఎస్ఎఫ్ చండూరు మండల సమితి ఆధ్వర్యంలో చండూరు పట్టణంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ , ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి గడ్డం నవీన్ మాట్లాడుతూ భారత స్వతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కొండ్రెడ్డి సాయి కుమార్ , ఏఐఎస్ఎఫ్ నాయకులు చరణ్ , సాయి , శ్రీకాంత్ , వంశీ ,సాగర్ ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నాంపల్లి** : భారత స్వాతంత్ర సంగ్రామంలో విప్లవ కెరటంగాఎగిసిన వీర విప్లవకారుడు భగత్ సింగ్ అని సిపిఐ మండల సహాయ కార్యదర్శి నేతాళ్ళ రాజు కొనియాడారు. సోమవారం మండల కేంద్రం అంబేద్కర్ స్కాచ్ వద్ద భగత్ సింగ్ 95 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జనంపాట జగన్,ఏఐవైఎఫ్ నాయకులు వెంకటాచారి,ఊరుపాక వెంకటయ్య,కానుగుల నరేష్,సురేష్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ:**దేశంలో నిరుద్యోగ సమస్యను






పరిష్కరించేందుకు పార్లమెంటులో భగత్ సింగ్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్ తీసుకురావాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు గుండెబోయిన సాయికిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం మర్రిగూడలోని సిపిఐ కార్యాలయంలో భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షులు గంట రాజు ,సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి, ఎరుకల నిరంజన్,ఎండి నజీర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నిడమనూరు:** అతి చిన్న వయసులోనే తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్వతంత్ర ఉద్యమంలో పాల్గొని అమరుడైన భగత్ సింగ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను అన్నారు.సోమవారం నిడమనూరు మండల కేందంలో భగత్ సింగ్ 95వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.











ప్రజాపక్షం/తుర్కపల్లి/ నకిరేకల్/రామన్నపేటలో మండలాలలో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో పలుచోట్ల భగత్‌సింగ్‌కు ఘన నివాళి



## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని శివన్నగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో సోమవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు.ఈకార్యక్రమాన్ని ఎంపీడీవో సి జి మున్నయ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ జంగిలి శాంతమ్మ మల్లయ్య,పంచాయతీ కార్యదర్శి లక్ష్మి,వార్డు సభ్యులు ముడిగే నరసింహ,ఊరు పక్క మహేందర్ తదితరులు పాల్గొన్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## పల్లె ప్రగతికి ప్రభుత్వ కృషి



**ప్రజాపక్షం/నిడమనూరు:** పల్లెల ప్రగతికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు, సోమవారం మండల పరిధి వెంకటాపురం గ్రామంలో సిసి రోడ్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నిడమనూర్ మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ మేరెడ్డి వెంకట్ రెడ్డి,వెంకటాపురం సర్పంచ్ సింగం రామలింగయ్య పాల్గొన్నారు.

## 6 గ్యారంటీలు అమలు అయ్యేవరకు విశ్రమించేది లేదు

**ప్రజాపక్షం/వేములపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుకోసం బిజెపి సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిచ్చిన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు అరెస్టు చేయడం అప్రజా స్వామీకం అని మండల అధ్యక్షుడు పెదమాం భరత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అరెస్ట్ అయిన వారిలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జవ్వాజి సత్యనారాయణ. పెదమం వెంకన్న,దామోదర్ రెడ్డి,బుల్లెద్దు లవయ్య,పెద్దమాం ప్రసాద్ ఉన్నారు.

## శాలిగౌరారం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా పరుశురాం



**ప్రజాపక్షం/నకిరేకల్ (శాలిగౌరారం):** శాలిగౌరారం మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా మాదారం గ్రామ సర్పంచ్ తోటకూరి పరుశురాం నియామకమయ్యారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ల ఆదేశానుసారం తోటకూరి పరశురాం ను మండల అధ్యక్షులు కందాల సమరం రెడ్డి సోమవారం నియమించారు.సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు గా ఎన్నికైన సందర్బంగా తోటకూరి పరుశురాం ను మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు అభినందించారు.

## సిసిరోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్** : మండలంలోని బోయ గూడెం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ వంగూరి సురేష్,మాజీ ఎంపీటీసీ నెమలి శ్రీధర్ రెడ్డిలు కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేసి శనివారం పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కై ఎన్ఆర్ ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పన్నులను చేపట్టినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ కట్టెబోయిన గురవయ్య,గ్రామ పార్టీ తెనాలి వికాస్ రెడ్డి,వార్డ్ నెంబర్ నెమలి కోటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

